

స్టీల్ బ్రిడ్జిపై ఆకతాయి బైక్ విన్యాసం

లోయర్ ట్యాంక్‌బండ్‌లో మొదలయ్యే నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జిపై ఆకతాయిలు విన్యాసాలు చేస్తూ వాహనాదారులను భాయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారని వాహనదారులు చెబుతున్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలతో స్టంట్‌లు చేయడంతో ఫొటోలు తీసి ఫిర్యాదు చేద్దామన్నా లాభం లేకుండాపోతోందన్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వాహనాదారులు కోరుతున్నారు. – చిక్కడపల్లి

క్రీడలకు కులం, మతం ఉండదు


పారా త్రోబాల్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్

ముషీరాబాద్: క్రీడలకు కులం, మతం ఉండదని అందరూ ఐక్యంగా క్రీడల్లో పాల్గొంటూ దేశ ప్రతిష్టను మరింత పెంపొందించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని అందారా హాల్‌లో పారా త్రోబాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి రాంచీలో జరిగే 3వ పారా నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే క్రీడాకారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సయ్యద్ అలందార్ హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ.. యువత క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందన్నారు. దివ్యాంగులు రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారా త్రోబాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబు, ముఖ్య సలహాదారులు సంజీవయ్య, ప్రముఖ కోచ్‌లు లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల 8నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- బీసీ భవన్ వద్ద కాలేజీ హాస్టల్స్ మహిళా వర్కర్లతో సమావేశం



ముషీరాబాద్: కాలేజీ హాస్టల్స్‌లో పని చేసే వర్కర్లకు 8నెలలుగా జీతాలు రావడం లేదని.. వెంటనే వారికి జీతాలు ఇచ్చి రూ.25వేలకు వేతనం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్ వద్ద కాలేజీ హాస్టల్స్‌లో పని చేసే మహిళా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తి వేయాలన్నారు. నేరుగా ప్రభుత్వం నుంచి వర్కర్లకు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఎస్సీ హాస్టల్స్‌లో వర్కర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు.

◆ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించడంతో పని భారం ఎక్కువై ఉద్యోగం వదిలి వెళ్లిపోతున్నారని అన్నారు. దీంతో హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. 150 విద్యార్థుల కంటే ఎక్కువ హాస్టల్స్‌లో ప్రతి 25 మందికి ఒక శాశ్వత వర్కర్‌ను అదనంగా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులకు ముగ్గురు వర్కర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. హాస్టల్స్ పరిపాలన విధానంలో ఇంత వరకు ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన పాలన విధానం రూపొందించలేదని అన్నారు. వెంటనే ఈ విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, ఎర్ర సత్యనారాయణ, అంజి, సి.రాజేందర్, వేముల రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో పేదలను రోడ్డుపాలు చేయొద్దు


వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చెరువులు, నాలాలు, పార్కులు, ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడే పేరు (హైడ్రా)తో పేదలను రోడ్డుపాలు చేయొద్దని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా జీవో నం.99 ద్వారా ఏర్పాటు చేసిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అయితే పేదల ఆస్తులకు భంగం కలిగించకుండా వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు మాత్రమే తొలగిస్తున్నామని వీటికి న్యాయస్థానం ఆదేశాలను మినహాయింపు ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారని అన్నారు. కూల్చివేత పర్వం సంపన్నుల నుంచి సామాన్యుల వరకు జరిగితే నష్టపోయేది సామాన్యులే అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా వెంటనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జి.నాగయ్య, సారంపల్లి మల్లారెడ్డి, ఎం.శోభన్‌నాయక్, టి.స్కైల్యాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిజాం రాచరికంపై పోరాడింది కమ్యూనిస్టులే..

కవాడిగూడ: నిజాం రాచరికంపై పోరాడింది కమ్యూనిస్టులేనని.. సాయుధ పోరాటంతోనే తెలంగాణకు విమోచనం లభించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. గురువారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద మగ్దూమ్ మోహియుద్దీన్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ..... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడింది కమ్యూనిస్టులే అన్నారు. స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేని ఆర్ఎస్ఎస్, బీజేపీలు రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేశాలు రెచ్చగొట్టే చర్యలు ప్రమాదకరం అన్నారు. తెలంగాణ ప్రాతంలో వేల ఎకరాల భూములను నిరుపేదలకు పంచడం కమ్యూనిస్టుల పోరాటం తోనే సాధ్యమయ్యిందన్నారు. నిజాం పాలనను తొలగించి ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించింది కమ్యూనిస్టులు చేసిన పోరాటమే అన్నారు. 4వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తల ప్రాణత్యాగ ఫలితం జాతీయ స్థాయిలో వచ్చిన భూసంస్కరణలే నిదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు, నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. వెంకటేష్, ఎం. శ్రీనివాస్‌రావు, ఎం. మహేందర్, ఎం దశరత్, కె. రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మిలాద్ ఉన్ నబీ


ఇన్‌స్పెక్టర్ అశోక్, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు


భోలక్‌పూర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని గురువారం ముషీరాబాద్ భోలక్‌పూర్‌లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. షర్బత్ పంపిణీ, అన్నదాన, బైక్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. భోలక్‌పూర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీని ఉద్దేశించి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ మాట్లాడారు. ప్రజలు ఐక్యంగా పండుగలను జరుపుకుంటూ మత సామరస్యాన్ని పెంపొందిస్తున్నారని అన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరిస్తూ శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఆలీ, రహీం, నబీ, సబిల్ హమ్మద్, చాంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలను ముఠా జైసింహ, భోలక్‌పూర్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌లు సన్మానించారు. భోలక్‌పూర్ నుంచి నిర్వహించిన ర్యాలీకి ముషీరాబాద్ చౌరస్తాలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంన్ష్‌యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అఖ్లాఖ్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ నాయకుడు షరీఫ్ పోలీసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు, డీఐ నదీం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్ అంబర్‌పేట రాహత్‌నగర్‌లో...

అంబర్‌పేట: మిలాద్ ఉన్ నబీ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం బాగ్ అంబర్‌పేట రాహత్‌నగర్‌లో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమానికి అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి ముఖ్య అతిథిగా వెళ్లారు. ముస్లింలకు వారు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమీల్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్ వద్ద సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్‌యాదవ్, ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబును సన్మానిస్తున్న అఖ్లాఖ్ హుస్సేన్


గుల్షన్ నగర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గౌసుద్దీన్

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

అంబర్‌పేట: రక్తదానం సాటి మనుషుల ప్రాణం కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం గోల్నాక పెరల్ గార్డెన్‌లో జేజీ మెమోరియాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులు, వైద్యులకు ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు.

అభినందనలు

అంబర్‌పేట: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) హెల్త్ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా సీహెచ్. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ ఆలీ, శివశంకర్ ఆయనకు నియమాక పత్రం అందజేశారు. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఉన్న కమిటీలో తనకు బాధ్యతలు అప్పగించడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు జేపీ చారి, దేశ్‌పాక స్వామి, మల్లేశ్, విజయందర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు

అంబర్‌పేట: క్షేత్రస్థాయిలో విస్తృతంగా బీజేపీ పార్టీ సభ్యత్వాన్ని చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఆధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ బూత్ నెంబర్–145 లో బూత్ అధ్యక్షులు వీరప్పతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పట్ల అభిమానం ఉన్న ప్రతి ఒక్కరికి సభ్యత్వం కలిప్పించేందుకు చొరువ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వర్, పులి నారాయణ, దీలిప్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నివాళి

కాచిగూడ: బీజేపీ నాయకుడు కన్నె నర్సింహ యాదవ్ ప్రథమ వర్ధంతి గురువారం ఇందిరానగర్‌లో జరిగింది. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృత, నాయకులు శ్యామ్‌రాజ్, అజయ్‌కుమార్, కృష్ణకుమార్, శిరీసాగర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని కమలా నెహ్రూనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కమలా నెహ్రూనగర్ ప్రజల ఫిర్యాదు మేరకు జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు భూమిలోకి ఇంకుతూ డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. వెంటనే పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

మాల, అనుబంధ కులాల సమాఖ్య కన్వీనర్ మాస్టా దయానంద్


లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల అనుబంధ కులాల సమాఖ్య నేతలు

కవాడిగూడ: ఎస్సీ వర్గకరణ రాజ్యాంగానికి విరుద్ధమని.. వర్గీకరణతో దళితుల్లోని ఐక్యతను దెబ్బ తీయడమేనని మాల, అనుబంధ కులాల సమాఖ్య తెలంగాణ కన్వీనర్ మాస్టా దయానంద్ అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల అనుబంధ కులాల సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దళితుల మీద ప్రేమ ఉంటే దళిత జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలన్నారు. రాజకీయ అవసరాల కోసం దళితుల మధ్య చిచ్చుపెట్టి వీడదీయొద్దన్నారు. జీవో నం.29ని రద్దు చేసి జీవో నం.55ను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీలకు క్రీమిలేయర్‌ను వర్తింపజేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందుగానే కమిటీ వేయడం అత్యుత్సాహానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం పునరాలోచించి ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె శ్రీధర్‌రావు, మంత్రి చంద్రశేఖర్, మంగమ్మ, నర్సింగరావు, కాశీరావు, మూలకేశవులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ మహాధర్నాను జయప్రదం చేయండి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని ఈనెల 25న ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.సాగర్ పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద చలో ఢిల్లీ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. అభయ ఆరణ్యాల దగ్గర సాగు చేస్తున్న రైతుల పంటలు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయని అన్నారు. వాటికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, శోభన్‌నాయక్, బాలకృష్ణ, ప్రసాద్, పి.ఆశయ్య, సాంబశివ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాదిగలను మభ్యపెట్టడానికే విజయోత్సవ ర్యాలీలు

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మూడు దశాబ్దాలుగా మాదిగలు మోసపోతున్నారని మరోసారి మాదిగలను మోసం చేయడానికే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఎద్దేవ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సౌత్ ఇండియా దళిత ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ... 341 ఆర్టికల్‌ను సవరిస్తూ దేశవ్యాప్తంగా వర్తిస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు పర్మనెంట్ పరిష్కారం కాదని ఈ తీర్పు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని విమర్శించారు. వర్గీకరణ అయ్యేదాక ఉద్యోగాలు చేపట్టవద్దు అని డిమాండ్ చేయడం వల్ల దళితులు అన్ని రంగాల్లో వాటాలు కోల్పోయారని అన్నారు. 341తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకోవచ్చని మాత్రమే చెప్పిందన్నారు. సుప్రీంకోర్టు పార్లమెంటు కంటే పెద్దదా పార్లమెంటులో చట్టం చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్‌మాదిగ, డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్, డాక్టర్ తెన్నేటి జయరాజ్, బల్లారి గోపి తదితరులు పాల్గొన్నారు.

సాయిధ పోరాటంలో సురవరం ప్రతాపరెడ్డి పాత్ర కీలకం

మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి


సురవరం ప్రతాపరెడ్డి యాదిలో పాల్గొన్న నర్సింహారెడ్డి, జనార్దనామూర్తి, రమణ

చిక్కడపల్లి: తెలంగాణ సాయిధ పోరాటంలో సురవరం ప్రతాపరెడ్డి కీలక పాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో పండితుడు, ఉద్యమకారుడు సురవరం ప్రతాప్ రెడ్డి యాదిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కవులే లేరని చేసిన విమర్శకు గోల్కొండ కవుల సంచిక గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో ప్రచురించి సమాధానమిచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. గోల్కొండ పత్రికను స్థాపించి ప్రజల్లో చైతన్యాన్ని నింపారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త , డబ్బింగ్ కళాకారులు శ్రీరమణ వెలమకన్ని, గాయకురాలు గరిమెల్ల సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు అక్కినేని నాగేశ్వరరావు

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


నృత్య కళాకారిణి మంజుభార్గవిని సత్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

చిక్కడపల్లి: ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు స్నేహశీలి అని సినీగేయ రచయిత, ప్రముఖ కవి సుద్దాల అశోక్‌తేజ అన్నారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరిన మహనీయుడని కొనియాడారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో సాంస్కృతిక సాంఘీక సేవా సంస్థ అభినందన, సంగమం ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని అభిమానుల పండుగ శీర్షికతో సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహించిన అక్కినేని అభిమానుల ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్య కళాకారిణి మంజు భార్గవికి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల గ్రూప్ చైర్మన్ నంగనూరి చంద్రశేఖర్, ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, ప్రముఖులు సంజయ్‌కిషోర్, రచయిత్రి డాక్టర్ కృష్ణకుమారి, పొన్నాడ మోహన్‌రావు, శ్రీమణి, అభినందన భవాని తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ మహాధర్నాను జయప్రదం చేయండి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని ఈనెల 25న ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.సాగర్ పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద చలో ఢిల్లీ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. అభయ ఆరణ్యాల దగ్గర సాగు చేస్తున్న రైతుల పంటలు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయని అన్నారు. వాటికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, శోభన్‌నాయక్, బాలకృష్ణ, ప్రసాద్, పి.ఆశయ్య, సాంబశివ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య
- 22న చలో హైదరాబాద్ మహాధర్నా చేపడుతున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలోని ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 22వ తేదీన చలో హైదరాబాద్ పేరిట ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. గురువారం బీఆర్‌టీయూ కార్యాలయంలో ఆటో యూనియన్ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సులను ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్ల పొట్టకొట్టారన్నారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదన్నారు. పదేళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నగరంలో ఆటో చార్జీలు పెంచకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ నాయకులు రమేష్, జనరల్ సెక్రటరీ రామకృష్ణా, ఉపాధ్యక్షులు చంద్రమౌలి, ఆశోక్, జంగయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా కృషి

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అందేలా కృషి చేస్తామని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అశోక్‌నగర్‌లోని కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో గురువారం భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్లు ఎ.పావనివినయ్ కుమార్, రచనశ్రీ, రవిచారి కలసి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. రక్తదానం చేసిన యువతను డాక్టర్ కె.లక్ష్మణ్ అభినందించారు. రక్తదానం చేస్తే తలసీమియ బాధితులకు సహాయం చేసిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూసరాజు, వినయ్‌కుమార్, రమేష్‌రామ్, భారత్‌గౌడ్, వెంకటేష్, పరిమళకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.11కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలపండి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో పైపులైను ఆధునీకరణ కోసం రూపొందించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం జలమండలి ఆపరేషన్ డైరెక్టర్–1 విజయరావుకు వినతిపత్రం ఇచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్‌లలో జలమండలి ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల కోసం రూ.11 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన డైరెక్టర్‌కు వివరించారు. నియోజకవర్గంలోని మెజారిటీ బస్తీల్లో కాలం చెల్లిన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ ఉందని వాటిని ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా డైరెక్టర్ స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

బీసీ అసంఘటిత కార్మిక సంఘం అధ్యక్షుడిగా బాలయ్య ముదిరాజ్

ముషీరాబాద్: బీసీ సంక్షేమ సంఘం అసంఘటిత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యానగర్‌కు చెందిన బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు చిక్కుడు బాలయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. విద్యానగర్‌లో జరిగిన బీసీ అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య గురువారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో పని చేస్తున్న బీసీ కార్మికుల కోసం కృషి చేస్తానన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం కాలనీవాసుల నిరసన

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ టీఆర్‌టీ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీలో జరుగుతున్న నిర్మాణం వద్ద కాలనీవాసులు తగరం అనిల్‌కుమార్, విఠల్, శైలేష్, కె.రాము, బాచీ, శ్రీనివాస్, కుమార్ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.